మార్చి 8 వరకు పీజీఆర్‌ఎస్ నిలుపుదల

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా పీజీఆర్‌ఎస్‌ను నిలుపుదల చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు మార్చి 8వ తేదీ వరకు జిల్లా,డివిజన్, మండలస్థాయిలో పీజీఆర్‌ఎస్ నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు.ప్రజలు మీకోసం పోర్టల్ ద్వారా సచివాలయాల్లో అర్జీలు రిజిస్టరు చేసుకోవచ్చన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ఆర్ఐవో నరసింహం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఇంటర్ ఆర్ఐవో ఎన్ఎస్‌వీఎల్.నరసింహం తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 77 సెంటర్లలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు.మొదటివిడత ఈ నెల 10,11,13,14 తేదీల్లో 58 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఒకేషనల్ 2వ స్పెల్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలో 10 సెంటర్లలో జరుగుతాయన్నారు.పరీక్షల పర్యవేక్షణకు మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నేడు పరీక్షా పే చర్చ

డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పరీక్షలపై విద్యార్థులకు భయాన్ని పోగొట్టేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పరీక్షపే చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డీఈవో కే.వాసుదేవరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సోమవారం ఉదయం 11 గంటలకు 6 నుంచి 10వ తరగతి వరకు చదువుకునే విద్యార్థులు పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో సుమారు 79 వేల మంది విద్యార్థులు ,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రిజిస్టర్ అయ్యారన్నారు.ఈ మేరకు జిల్లా ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం యూట్యూబ్, టీవీ చానళ్ళ ద్వారా ప్రత్యక్షప్రసారం జరుగుతుందని చెప్పారు.ప్రతి పాఠశాల తరగతి గదుల్లో ముందుగానే ఐఎఫ్‌బీలు, స్మార్ట్ టీవీలు ,కంప్యూటర్లు ఏవి వీలైతే వాటిని ఉపయోగించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు అంతా ఈ కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేయాలన్నారు.కార్యక్రమం ముగిసిన వెంటనే రెండు,మూడు ఫొటోలు,ఎన్‌సీఈఆర్‌టీ ద్వారా ఇవ్వబడిన లింక్‌లలో అప్‌లోడ్ చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు.

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్ నామినేషన్

- కాకినాడ నుంచి ఏలూరు టీడీపీ కార్యాలయం వరకు కార్ల ర్యాలీ
- కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు



పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్

కాకినాడసిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఈనెల 10న ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంనుంచి కార్ల ర్యాలీగా బయలుదేరనున్నారు. ఉదయం 7.30 గంటలకు రామచంద్రపురం, 8.15గంటలకు మండపేట, 8.45గంటలకు రావులపాలెం, 9.10 గంటలకు తణుకు, 9.30 గంటలకు తాడేపల్లిగూడెం, 9.45గంటలకు ఉంగుటూరు, 10 గంటలకు ఏలూరు టీడీపీ కార్యాలయానికి చేరుకోనున్నారు. అక్కడినుంచి ఏలూరు కలెక్టరేట్‌కు ఉదయం 11గంటల కు చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు. భారీసంఖ్యలో కార్లతో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ నామినేషన్ ర్యాలీకి కూటమి నేతలు సన్నాహాలు చేశారు.



గీత కూ.. ఫుల్‌గా!

13 షాపులకు 387 దరఖాస్తులు

- నిడదవోలులో అత్యధికం
- అనపర్తిలో అత్యల్పం
- లైసెన్స్ ఫీజులో రాయితీ
- దుకాణాలకు డిమాండ్
- ఎన్నికల కోడ్..లాటరీ వాయిదా
- గీత కార్మికుల్లో తీవ్ర నిరాశ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మద్యం షాపులకు ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదు..ఇప్పటికే మద్యం షాపులు పాడుకున్న వారు లాభాలు రావడంలేదని లబోదిబో మంటున్నా గీత కార్మికులు వెనక్కు తగ్గలేదు. జిల్లాలో గీతకులాలకు ప్రభుత్వం కేటాయించిన 13 షాపులకు ఏకంగా 387 దరఖాస్తులు వచ్చాయి. కానీ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాటికి లాటరీ తీయడం వాయిదా పడింది.గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 8వ తేదీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకూ దరఖాస్తులు స్వీకరించారు. రాజమహేంద్రవరం సబ్-కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఈ దరఖాస్తులకు లాటరీ తీసి షాపులు కేటాయించాల్సి ఉంది.ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్టు ఎక్సయిజ్ సూపరింటెండెంట్ లావణ్య ప్రకటించారు.దీంతో దరఖాస్తుదారుల్లో నిరుత్సాహం ఏర్పడింది.

ఎన్నికల కమిషన్ చేతుల్లో..

గీత కులాలకు సోమవారం కేటాయించాల్సిన మద్యం షాపులు ఎన్నికల కోడ్ వల్ల వాయిదాపడడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి కోరనుంది.వాస్తవానికి ఈ షాపుల కేటాయింపు ఎన్నికల కోడ్ కంటే ముందుగానే జరిగింది.దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా ముందుగానే ఆరంభించారు. దీని వల్ల లాటరీ వేసి ఈ షాపులను లబ్ధిదారులకు కేటాయించేందుకు అనుమతివ్వాలని ప్రభుత్వం కోరుతున్నట్టు సమా చారం. ఎన్నికల సంఘం అనుమతి ఇస్తే వెంటనే లాటరీ వేసి ఈ షాపులను అప్పగించే అవకాశం ఉంది. లేదంటే మార్చి నెల 8వ తేదీ తర్వాతే షాపులు కేటాయిస్తారు.

హామీ నెరవేర్చిన కూటమి..

తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గీత కులాలకు 10 శాతం మద్యం దుకాణాలను కేటాయిస్తామని సార్వత్రిక ఎన్నికల మేని ఫెస్టోలో ప్రకటించింది.ఆ హామీ మేరకు నోటిఫికేషన్ విడుదల చేయగా జిల్లాలో 13 షాపులు వచ్చాయి.అందులో గీతకులాలకు చెందిన శెట్టిబలిజలకు 11, గౌడ-1, గౌడ్-1 వచ్చాయి. షాపుల కేటాయింపునకు రాజమహేంద్రవరం సిటీతో పాటు, పలు మండలాలను గుర్తించారు.

నిడదవోలులో 48 దరఖాస్తులు

ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇవ్వడంతో పోటీ పెరిగింది.రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో సాధారణంగా అయితే ఒక్కో దుకాణానికి ఏడాదికి 93.75 లక్షలు చెల్లించాలి. కానీ గీత కులాలకు కేటాయించిన షాపునకు 50 శాతం రాయితీ ఇవ్వడం వల్ల 46.75 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. మండలాల్లో సాధారణంగా 76.5 లక్షలు చెల్లించాలి. గీతకులాలు మాత్రం రూ.35.75 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.దీంతో జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువగా వచ్చాయి. నిడదవోలు మండలంలోని గౌడ సామాజిక వర్గానికి కేటాయించిన దుకాణానికి ఏకంగా 48 దరఖాస్తులు వచ్చాయి. అనపర్తిలో గౌడ్ కులానికి కేటాయించిన షాపునకు మాత్రం 9 దరఖాస్తులే వచ్చాయి. సీతానగరం,చాగల్లు, గోపాలపురం మండలాల్లో శెట్టిబలిజలకు కేటాయించిన దుకాణాలకు ఒక్కో చోట 43 వంతున దరఖాస్తులు వచ్చాయి. దేవరపల్లి, పెరవలి మండలాల్లో శెట్టిబలిజలకు కేటాయించిన షాపులకు 39 వంతున దరఖాస్తులు వచ్చాయి. రాజమహేంద్రవరంలో షాపునకు 22, కడియం 22, కోరుకొండ 26, రంగంపేట 13, బిక్కవోలు 14, తాళ్లపూడి 26 దరఖాస్తులు వచ్చాయి.

ఆదాయం రూ.7.74 కోట్లు

గీతకులాలకు కేటాయించిన 13 షాపులకు 387 మంది దరఖాస్తు చేశారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లించారు.అంటే మొత్తం రూ.7.74 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభించింది.13 షాపులకు ప్రభుత్వానికి ఆయా లైసెన్స్‌దారులు రూ.4 కోట్ల, 75 లక్షల 75 వేలు ఏడాదికి చెల్లించాలి. గతేడాది అక్టోబరు నుంచి ఈ మద్యం కొత్త పాలసీ అమల్లోకి వచ్చింది.షాపులకు రెండేళ్ల పాటు లైసెన్స్ ఉంటుంది.కానీ ఈ షాపులకు వచ్చే నెలలో లైసెన్స్‌దార్లకు వస్తే సెప్టెంబరుకు ఒక ఏడాది పూర్తవుతుంది.అక్కడ నుంచి 2026 సెప్టెంబరు వరకూ మరో ఏడాది ఉంటుంది.

ఫొటో తీయమని చెప్పి.. గోదారిలో దూకేశాడు!

అప్పుల బాధ తాళలేక ఒకరి ఆత్మహత్య

- రూ. కోటి వరకూ అప్పులు ఉన్నట్టు సమాచారం
- 10న సొమ్ములు చెల్లిస్తానని చెప్పిన వైనం
- ఆదివారం సినిమా చూసి వస్తూ ఆత్మహత్య





కొవ్వూరు/దేవరపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తన షాపులో పనిచేసే యువకుడితో కలిసి సినిమాకు వెళ్లాడు.. తిరిగి వస్తూ గోదావరిపై రోడ్ కం రైలు బ్రిడ్జిపై ద్విచక్రవాహనం ఆపాడు. కిందకు దిగి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీయమన్నాడు.. ఫొటో తీస్తుండగానే గోదావరిలో దూకేశాడు.క్షణాల్లో మృత్యువాత పడ్డాడు.చూస్తుండగానే యజమాని మృతిచెందడంతో అతని వద్ద పనిచేసే చిట్యాలకు చెందిన యువకుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. దేవరపల్లి గ్రామానికి చెందిన పింజర్ల నాగేశ్వరరావు (64) చెప్పుల వ్యాపారంతో పాటు ప్రైవేటు చీటీల వ్యాపారం చేస్తుంటాడు. గత 36 ఏళ్లగా దేవరపల్లి ప్రజలకు సుపరిచితుడు. దేవరపల్లి,బంధపురం, లక్ష్మీపురం, యాదవోలు, దుద్దుకూరు గ్రామాల్లో చీటీలు కట్టించుకునేవాడు.గత రెండేళ్లుగా చీటీలు పాడుకున్నవారికి డబ్బులు చెల్లించకపోవడంతో ఒత్తిడి పెరిగింది. దీంతో గతేడాది గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో కాపాడారు. నాటి నుంచి చెప్పుల వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఇతను చీటీల డబ్బులు సుమారు రూ.కోటికి పైగా చెల్లించాల్సి ఉన్నట్టు తెలిసింది.ఇటీవల చీటి డబ్బుల కోసం ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో కొంతమందికి ఐపీ నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది.అయినా షాపు వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండడంతో బాగా ఇబ్బందిపడుతున్నాడు. చాలా మందికి ఈ నెల 10వ తేదీన డబ్బులు చెల్లిస్తానని చెప్పినట్టు స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా వెదవ జీవితం బతకాలని లేదని స్నేహితుల వద్ద వాపోతున్నాడు. స్నేహితులు వారిస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం సెలవు కావడంతో తన వద్ద పనిచేసే యువకుడిని తీసుకుని రాజమహేంద్రవరం వెళ్లాడు.తిరిగి వచ్చే సమయంలో కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై 106వ స్తంభం వద్ద ఆగారు. ఫొటోలు తీయమని చెప్పి ఇంతలో గోదావరిలో దూకేశాడు. ఈ సంఘటనను నదిలో నుంచి గమనిస్తున్న జాలర్లు పడవపై వచ్చి కొన ఊపిరితో ఉన్న నాగేశ్వరరావును రాజమహేంద్రవరం వైపు తీసుకువెళ్లారు. లోతు ఎక్కువగా ఉన్న చోట దూకడంతో అప్పటికే మృతిచెందాడు. భార్య రెండేళ్ల కిందట మృతిచెందింది. అతనికి ఇద్దరి కుమార్తెలు ఉండగా వివాహాలయ్యాయి. చిన్న కుమార్తె పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

తండేల్ సినిమా చూసి వస్తుండగా ఇలా చేశారు!

ఉదయం ఫోన్ చేసి రాజమహేంద్రవరం వెళదాం రమ్మంటే వచ్చాను.. తండేల్ సినిమాకు తీసుకెళ్లారు. అనంతరం శ్రీ కన్య రెస్టారెంట్‌కు వెళ్లి భోజనం చేశాం.ఉదయం నుంచి బాగానే ఉన్నారు. ఇలా చేస్తారని అనుకోలేదు. ఫొటో తీయమని చెప్పి గోదావరిలో దూకేశారు.నేను చూస్తుండగానే చనిపోయారు. తలుచుకుంటే బాధగా ఉంది. ఆ ఘటన నా కళ్లెదుట మెదులుతూనే ఉంది.

- విక్రమ్, షాపులో పనిచేసే యువకుడు, చిట్యాల



వెళుతున్న లారీ నుంచి మంటలు

గామన్ బ్రిడ్జిపై ఆదివారం ఉదయం ఒక లారీ వెళుతోంది.. ఒక పక్క నుంచి మంటలు వస్తూనే ఉన్నాయి.. లారీ డ్రైవర్ గమనించలేదు.. ఆ మంటలు పెరిగాయి.. వెనుక వస్తున్న డ్రైవర్ అప్రమత్తం చేయడంతో డ్రైవర్ కంగారుపడి కిందకు దిగిపోయాడు. పగులు రాయి లోడుతో వెళుతున్న లారీ చూస్తుండగానే దగ్ధమైపోయింది.. అరగంటలో లారీ మొత్తం కాలి బూడిదైపోయింది.. ప్రమాదాన్ని గమనించిన లారీ డ్రైవర్, క్లీనర్ బయటపడి ప్రాణాలు కాపాడుకున్నారు.. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. - 8లో

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభ్యంతరం లేని అక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి తీసుకున్న నిర్ణయంతో అర్హులైన పేదలకు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈజీగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం దక్కిందన్నారు. ఈ పథకానికి సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ,వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీసీఎల్ఎఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి తెలియజేశారన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సిబ్బందికి సూచనల చేసినట్టు తెలిపారు. జీవో నెం 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరిట భూములు క్రమబద్ధీకరణ చేపడతామన్నారు.ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు గ్రామ,వార్డు సచివాయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. క్రమబద్ధీకరణ మేరకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తామన్నారు. లబ్ధిదారులు తమ పూర్తి వివరాలు నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలతో మీసేవ ద్వారా అప్‌లోడ్ చేయవలసి ఉంటుందన్నారు. 2019 అక్టోబరు 15ను ప్రామాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణల్లో ఉన్న భూములను క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహుడి గ్రామోత్సవం

● గజ వాహనంపై ఊరేగిన స్వామివారు

● పెద్దసంఖ్యలో హాజరైన భక్తులు

అంతర్వేది, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయంలో బారులు తీరారు. తొలుత పొలమూరి వారి వార్షిక అభిషేకం నిర్వహించారు. ఈ అభిషేకంలో పొలమూరి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొని విశేష పూజలు చేశారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు లక్కవరం వాస్తవ్యులు మంగెన నాగేశ్వరరావు వారిచే నిర్మితమైన గజ వాహనంపై స్వామివారిని ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి వెంట నారసింహ, గోవిందనామస్మరణ చేశారు. శృంగవరప్పాడు వాస్తవ్యులు రావివెంకట సత్యనారాయణ, శ్రీహరిరావు వారిచే పొన్నవాహనంపై స్వామివారి గ్రామోత్సవం రాత్రి ఎనిమిది గంటలకు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి హారతులు పట్టారు.

● అన్న పర్వత మహా నివేదన

కల్యాణోత్సవాల్లో భాగంగా స్వామివారికి ఆదివారం రాత్రి 7 గంటలకు అన్నపర్వత మహా నివేదన జరిపారు. తొలుత సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి దర్శనాలు నిలిపివేసి ఆలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పశ్చిమ గోదావరి జిల్లా పొలమూరుకు చెందిన కలిదిండి వంశీయులు క్వింటాల్ బియ్యంతో అన్నం వండించారు. స్వామివారి మూల విరాట్ ఎదుట ఉన్న గంట మండపంలో అన్నాన్ని రాశిగా పోశారు. రెండు రకాల కూరలు, పప్పు, పులుసు, పెరుగు, నెయ్యి, బూరెలతో స్వామివారికి మహానివేదన జరిపారు. ప్రధాన అర్చకులు, స్థానాచార్యులు వింజమూరి రామరంగాచార్యులు, పాణింగపల్లి శ్రీనివాస కిరణ్, వేదపండితులు చింతా వెంకటశాస్త్రి, అర్చక స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంత రం తిరిగి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజాకలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, పొలమూరు వంశీయులు, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఉత్సవ కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, బైరా నాగరాజు, ఉండపల్లి అంజి, పోతురాజు శ్రీవెంకటకృష్ణ, వనమాలి మూలాస్వామి, వలవల రాంబాబు, పొలమూరి సత్రం నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.



అంతర్వేదిలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పొన్నవాహనంపై స్వామివారి గ్రామోత్సవం

● అంతర్వేదిలో నేడు..

స్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు స్వామివారికి హనుమద్ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 5 గంటలకు పండిత సదస్యం, 7 గంటలకు సింహ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం జరగనున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

'నాటిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం'



రావులపాలెంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు నాగమోహన్‌రెడ్డి, రూపశిల్పి వెంకటరెడ్డి

రావులపాలెం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): నాటిక కళాకారులను ప్రోత్సహించడమే లక్ష్యమని సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహన్ రెడ్డి, రూపశిల్పి గొలుగూరి వెంకటరెడ్డి, కార్యదర్శి కర్రి అశోక్‌రెడ్డి అన్నారు. కోనసీమ జిల్లా రావులపాలెం సీఆర్సీ ఓల్డేజ్ హోమ్‌లో మీటింగ్ హాలులో ఆదివారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్సీ కాటన్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉగాది నాటిక పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాదీ మార్చి 30, 31, ఏప్రిల్ 1వ తేదీన సీఆర్సీ ఉగాది నాటికపోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ పోటీలకు రాష్ట్రస్థాయి నుంచి ఏడునాటికలను ఎంపిక చేయ డం జరిగిందన్నారు. ఇందులో అమరావతి ఆర్ట్స్, గుంటూరి వారి చిగురుమేఘం, విశ్వశాంతి కల్చరల్ అసోషియేషన్ హైదరాబాద్ వారి స్వేచ్ఛ, మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మస్వరూపం, శ్రీసాయి ఆర్ట్స్ గొలకలూరు జనరల్ భోగిలు, మిత్ర క్రియేషన్స్ హైదరబాద్ వారి ఈ రహదారి కాదు, అరవింద ఆర్ట్స్ తాడేపల్లివారి విడాకాలు కావాలి, సహృదయ ద్రోణాదుల వారి వర్క్‌ఫ్రమ్ హోమ్ నాటికలను ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ఉత్తమ నాటికలకు మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.75 వేలు మూడో బహుమతి రూ.50 వేలుగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో మల్లిడి అంజనీకుమార్‌రెడ్డి, త్రిమూర్తులు, చిర్ల కనికిరెడ్డి, సూర్య, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

పిఠాపురం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రాష్ట్ర స్థాయి బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక జరిగింది. బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బాక్సింగ్ పోటీలు నిర్వహించారు. ఇందులో సీనియర్ మహిళల బాక్సింగ్ జట్లను ఎంపిక చేశారు. కాకినాడ జిల్లాకు చెం దిన బాక్సర్లు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ కనబరిచారు. నాలుగు విభాగాలకు గాను నలుగురు బాక్సర్లను రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. 48 కిలోల విభాగంలో కె.అక్షయ (తుని), 51 కిలోల విభాగంలో ఎం.రాజరాజేశ్వరీ (చిత్రాడ), 54 కిలోల విభాగంలో ఆర్‌జీ ఎన్ గంగాభవానీ(తుని), 80 ప్లస్ ఓపెన్ వెయిట్ కేటగిరిలో జే.ఐశ్వర్య సూర్య దీపిక (పిఠాపురం) కాకినాడ జిల్లా జట్టుకు ఎంపిక కాగా, వీరు ఈనెల 11,12వ తేదీల్లో విశాఖపట్టణంలో జరగనున్న రాష్ట్రస్థాయి సీనియర్ ఉమెన్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొంటారని బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.లక్ష్మణరావు తెలిపారు.



పోటీలకు ఎంపికైన కాకినాడ జిల్లా క్రీడాకారులు

కార్యక్రమంలో కౌన్సిలర్ రాయుడు శ్రీను, అసోసియేషన్ ప్రతినిధులు ఇమ్మిడిశెట్టి నాగేంద్రకుమార్, జి.శివప్రసాద్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుడి నిత్యాన్నదానానికి రూ.2 లక్షల విరాళం

అన్నవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి, గోసంరక్షణ ట్రస్టులకు ఆదివారం దేవస్థానం వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు చామర్తి కన్నబాబు, గుత్తిన శ్రీనివాస్ డ్యూటీ తరఫున సత్యదేవ నిత్యాన్నదానానికి రూ.లక్ష, సత్యదేవ గోసంరక్షణ ట్రస్ట్‌కు మరో రూ. లక్ష విరాళంగా సమర్పించారు. ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌కు డ్యూటీసభ్యు లు అందజేశారు. వారిని ఈవో, చైర్మన్ అభి నందించారు. అల్లంరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాకినాడ జేఎన్టీయూకు
ఏపీ ఈఏపీసెట్ నిర్వహణ బాధ్యతలు

● చైర్మన్‌గా వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, కన్వీనర్‌గా వీవీ సుబ్బారావు



చైర్మన్ వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ



కన్వీనర్ వీవీ సుబ్బారావు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్టాత్మక ఏపీఈఏపీ సెట్ 2025-26 ప్రవేశపరీక్ష నిర్వహణ బాధ్యతను కాకినాడ జేఎన్టీయూకు అప్పగించారు.ఇంజనీరింగ్, ఫార్మసీ, వ్యవసాయ, తదితర కీలక కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి పరీక్షల నిర్వహణ బాధ్యత తొమ్మిదోసారి దక్కింది. అయితే పరీక్ష నిర్వహణకు సంబంధించి జేఎన్టీయూకే ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇప్పటి వరకు 2015 నుంచి 2019 వరకు కన్వీనర్‌గా ప్రొఫెసర్ సీహెచ్ సాయిబాబు ఆధ్వర్యంలో ఐదుసార్లు ఏపీఈఏపీ సెట్‌ను నిర్వహించారు. అలాగే ప్రొఫెసర్ వి.రవీంద్ర కన్వీనర్‌గా 2021, 2022లో రెండుసార్లు, ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి ఆధ్వ ర్యంలో 2024లో ఒకసారి ఈ ప్రవేశపరీక్షను జేఎన్టీయూకే నిర్వహించింది. గత ఏడాది పలు కోర్సు ల్లో ప్రవేశాల కోసం అత్యధికంగా 3,46, 424 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం విశేషం. ఈ సారి ఏపీఈఏపీసెట్ 2025-26 ఏడాదికి 9వ సారి వర్సిటీ పూర్వపు రిజిస్ట్రార్ వీవీసుబ్బారావును కన్వీనర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో పీజీ సెట్‌తో పాటు కాపు విద్యోన్నతి అర్హత పరీక్షలు, ఉమ్మడి ఏపీలో ఎంసెట్ యూసీఈకే కౌన్సిలింగ్ సెంటర్ సమన్వయకర్తగాను వ్యవహరించడంతోపాటు పలు ఉద్యోగ ప్రవేశపరీక్షలు నిర్వహించారు.

గరుడ వాహనంపై భీమేశ్వరుడి నగరోత్సవం



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వర స్వామివారి కల్యాణమహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారికి గరుడ వాహనంపై నగరోత్సవాన్ని నిర్వహించారు. రాత్రి ఎనిమిది గంటలకు మేళతాళాలతో మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామివారు, చండికా సమేత సూరేశ్వరస్వామివారు, లక్ష్మీసమేత నారాయణస్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో పోటీతత్వం ఉండాలి

● అవగాహన సదస్సులో తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): మానసికంగానే కాకుండా శారీరకంగా కూడా దృఢంగా ఉండేలా విద్యార్థులను తయారు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు.విశాఖ జిల్లా పాయకరావుపేట తిరుమల విద్యా సంస్థల ఆవరణలో ఆది వారం 10వ తరగతి పూర్తి చేస్తున్న విద్యా ర్థులు,వారి తల్లిదండ్రులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సదస్సుకు సుమారు 5 వేల మంది హాజరైనట్లు చెప్పారు. దేశవ్యాప్తంగా జరిగే ఇంజనీరింగ్ (జేఈఈ మెయిన్స్ అండ్ అడ్వాన్స్), నీట్ పరీక్షలకు ఎంతో పోటీ ఉందన్నారు. ఆ ఒత్తిడిని తట్టుకుని నిలిచేలా పిల్లలను సన్నద్ధం చేసి నప్పుడే వారు వృద్ధిలోకి వస్తారన్నారు. విద్యా ర్థుల్లో పోటీతత్వం ఉండాలన్నారు.ఈ సదస్సులో జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్,నీట్‌లో విద్యార్థులు ఎదుర్కొనే పలు ఇబ్బందులపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.డైరెక్టర్ నున్న సరోజినిదేవి మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలను సరైన మార్గంలో పెంచాలన్నారు. విలువలతో కూడిన విద్యను పిల్లలకు అందించాలన్నారు. సదస్సులో పలువురు తల్లిదండ్రులు తమ అనుభవాలు పంచుకున్నా రు.కార్యక్ర మంలో ప్రిన్సిపాల్స్ వి.శ్రీహరి, కె.విజ యకుమార్, స్కూల్ ఇన్‌చార్జి ఎం.సునీత, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతిప్రజ్వలన చేస్తున్న చైర్మన్ తిరుమలరావు

పెళ్లయిన ఏడాదికే..యువకుడి ఆత్మహత్య

అనపర్తి ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) :పెళ్లయిన ఏడాదికే ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తికి చెందిన తమలంపూడి సాయి సాకేత్‌రెడ్డి (29) కొంతకాలంగా మానసికంగా బాధపడుతున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం పురుగుల మందు తాగాడు. దాన్ని గుర్తించిన బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. కుటుంబీకులు బోరున విలపించారు.



సాయి సాకేత్‌రెడ్డి (ఫైల్)

ఇసుకలో బండి జారి..
లారీ కిందకు..

● బొబ్బిల్లంకలో యువకుడి మృతి

సీతానగరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలివి ... తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద ఆదివారం జరిగింది. సీతానగరం మండలం చినకొండేపూడికి చెందిన దంతే ప్రసాద్ (26) రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా... బొబ్బిల్లంక వద్ద ఇసుక కుప్పలు అడ్డు వచ్చాయి. దీంతో బండి స్కిడ్ అవడంతో అటుగా వస్తున్న లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. మృతుని తలపై నుంచి లారీ వెళ్లడంతో సంఘటనా స్థలంలోనే ప్రసాద్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడికి ఇంకా వివాహం కాలేదు. ఈయనకు తండ్రి అబ్బులు, తల్లి చిన్నబుల్లి , ముగ్గురు సోదరులు ఉన్నారు.

బంగారుపాప ఉరుసు ఉత్సవాలకు ..
భారీగా పోటెత్తిన భక్తులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడలో వేంచేసి ఉన్న బషీర్‌బీబీ ఔలియా 70వ (బంగారుపాప) ఉరుసు ఉత్సవాలకు భక్తులు భారీగా పోటెత్తారు. ఉత్సవాల్లో ఆఖరిరోజైన ఆదివారం జిల్లా నలు మూలల నుంచి హిందూ, ముస్లిం భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రతి ఏడాది మధ్యా హ్నం మూడు గంటలు దాటిన తర్వాత భక్తులు దర్శనానికి వచ్చేవారు కాదు. కానీ ఈ యేడాది ఉదయం నుంచీ బారులు తీరడం గమనార్హం. సాయంత్రమయ్యే కొద్దీ భక్తుల రద్దీ పెరగడంతో సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ జి.వెంకటేష్ నేతృత్వంతో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా బందోబస్తును ఏర్పాటు చేశారు.



దర్శనానికి లైన్‌లో వేచి ఉన్న భక్తులు

మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాల పంట

● సత్తా చాటిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

● 32 బంగారం, 12 రజతం, 8 కాంస్య పతకాలు

● మార్చ్‌ఫాస్ట్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమం



మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధించిన క్రీడాకారులు

కాకినాడ అర్బన్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అనంతపురం పోలీస్ శిక్షణ కేంద్రం మైదానంలో శని, ఆదివారాల్లో నిర్వహించిన మాస్టర్ అథ్లెటిక్స్ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. 13 జిల్లాల నుంచి మొత్తం 500 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది హాజరై వివిధ పోటీల్లో పతకాలు సాధించారు. 30 నుంచి 90 ఏళ్ల వయస్సు గల క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో 32 బంగారు, 12 రజత, 8 కాంస్య పతకాలు వచ్చాయి.

మార్చ్‌ఫాస్ట్ విభాగంలో రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచారు. ఈసందర్భంగా క్రీడాకారులను మాస్టర్స్ అథ్లెటిక్స్ సం ఘం ఆదివారం అభినందించింది. సంఘ జిల్లా అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో 52 పతకాలను జిల్లా క్రీడాకారులు సాధించడం అభినందనీయమన్నారు. క్రీడాకారులను డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి బాపిరాజు, పీఈటీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.జార్జి, ఒలింపిక్ సంఘ రాష్ట్ర సీఈవో చంద్రు గోవిందరాజు, చీఫ్ ప్యాట్రన్ కర్రి భామిరెడ్డి, తదితరులు అభినందించారు.

ఉత్సాహంగా రాష్ట్ర స్థాయి వ్యాయామోపాధ్యాయుల క్రీడా పోటీలు

కాకినాడఅర్బన్,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడాపోటీలు కాకినాడలోని జిల్లా క్రీడామైదానంలో ఆదివారం ఉత్సాహంగా సాగాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వ్యాయామఉపాధ్యాయులు పలు క్రీడల్లో తమ ప్రతిభను చాటారు. అథ్లెటిక్స్, వాలీబాల్, కబడ్డీ, హాకీ, బ్యాడ్మింటన్‌లో పోటీలు నిర్వహించారు. విజేతలకు వ్యాయామ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర నాయకులు బహుమతులు అందజేశారు. రాష్ట్ర అధ్యక్షుడు లంకా జార్జి, జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, లంక గోవిందరాజులు, పప్పుల శ్రీరామచంద్రమూర్తి, నూకరాజు, రవి సుందర్‌కౌర్, తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయి వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులు

20 వరకు రైళ్లు ఆలస్యం

ఇంటర్‌లాకింగ్ పనులే కారణం

సామర్లకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనుల వల్ల ఈ నెల 10వ తేదీ నుంచి 20 వరకు సామర్లకోట మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు 75 నిమిషాల నుంచి 90 నిమిషాల పాటు ఆలస్యంగా నడుస్తాయని రైల్వే పీఆర్‌వో కార్యాలయం నుంచి శనివారం రాత్రి ఆదేశాలు అందాయి. ఈమేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి అందిన సమాచారాన్ని 'ఆంధ్రజ్యోతి' సేకరించింది. 20834 నెంబరు గల వందే భారత్ (సికింద్రాబాద్ - విశాఖ) మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ 19,20 తేదీలలో 75 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

ఆర్టీసీ డ్రైవర్‌పై..
ఆటో వాలా దాడి

● పాత కక్షలతోనే ఘటన

కరప, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో ఆర్టీసీడ్రైవర్‌పై ఓ ఆటోవాలా కత్తితో దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కాకినాడ జిల్లా కరప మండలం కూరాడకి చెందిన కేదాసి నూరిబాబు ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మేడపాటి శ్రీనివాసరావు ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు.కాగా ఆదివారం మధ్యాహ్నం నూరిబాబు వేళంగి-జి.బావారం రోడ్డులో వైన్ షాప్ దగ్గర్లో నిలబడి ఫోన్ మాట్లాడుతుండగా, అక్కడకు శ్రీనివాసరావు ఆటోలో వచ్చి కత్తితో నూరిబాబుపై దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఏడాది క్రితం అంబేద్కర్ జయంతి రోజున బోజనాల వద్ద వీరిద్దరికీ గొడవ జరిగిందని, దాన్ని మనసులో పెట్టుకుని చంపాలనే ఉద్దేశంతో శ్రీనివాసరావు దాడి చేసినట్టు బాధితుడు నూరిబాబు తెలిపారని ఎస్ఐ తోట సునీత చెప్పారు.

కోడి పందాల శిబిరంపై పోలీసుల దాడి

● నలుగురి అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోడి పందాల శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లిలో ఆదివారం కోడి పందాలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో పట్టణ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.16,800 నగదు, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

సూర్య ద్వాదశ కామ్య వ్రతం

కొవ్వూరు, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి):కొవ్వూరులోని శ్రీనివాస స్నానఘట్టంలో ప్రకృతి రావణబ్రహ్మ శివాలయంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగం 11వరోజుకు చేరుకుంది. ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ పర్యవేక్షణలో సూర్య ఉపాసకుడు విక్రమాదిత్య ఆధ్వ ర్యంలో సూర్యద్వాదశ కామ్య వ్రతం నిర్వహించారు.

చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన

కొవ్వూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి) : కొవ్వూరులోని పాతవూరులో శ్రీఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిళ్వార్చన నిర్వహించారు. ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన చిరవూరి సుబ్రహ్మణ్యం, రమా సత్యశై లజ దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు.

ఈ రోడ్డుకు మోక్షమెప్పుడు!

● ఒక వైపు దుమ్ము..... మరో వైపు కంకర రాళ్లతో ఇబ్బందులు
●కాతేరు - సీతానగరం రోడ్డు దుస్థితి


రోడ్డుపై కంకర రాళ్లు లేచిపోయిన దృశ్యం


రోడ్డుపై దుమ్ము లేపుతున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్డుపై ఆ ప్రాంతంలో ప్రయాణించాలంటే బెంబేలెత్తి పోతున్నారు. ఒక వైపు దుమ్ము, మరో వైపు కంకరరాళ్లు లేచిపోవడంతో వాహనాలు వెళ్లేటప్పుడు వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు నుంచి సీతానగరం వరకు రూ.100కోట్లతో నాలుగు లైన్ల రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే చాలా వరకు రోడ్డు పనులు పూర్తయ్యాయి. కాని కొన్ని చోట్ల మాత్రం అసంపూర్తిగా వదిలేశారు. వెంకటనగరం జంక్షన్ నుంచి టిడ్కో ఇళ్ల సముదాయం వరకు రోడ్డుపై కంకర వేసి నిర్మాణం చేపట్టి కొంతమేర తొక్కించి వదిలేశారు. జనవరి 15వ తేదీ ముందు ఈపని చేపట్టారు. కొన్ని రోజులు అడపా తడపా నీళ్లతో తడిపి వదిలేశారు. అప్పటి నుంచి ఎలాంటి పని చేయకపోవడంతో రోడ్డుపై వేసిన కంకర రాళ్లు లేచిపోయి వాహన చోదకులకు శాపంగా మారింది. స్కూల్ బస్సులు ఇసుకు ట్రాక్టర్లు, ప్రభుత్వ వాహనాలతో నిత్యం రద్దీగా వుండే రోడ్డుపై ఈప్రాంతంలో ప్రమాణించాలంటే భయపడిపోతున్నారు. గతంలో గుంతలతో ఉన్నప్పుడు వాహనచోదకులు గుంతలకు భయపడి నెమ్మదిగా వెళ్లేవారని, ప్రస్తుతం ఆర్అండ్‌బీ అధికారులు అరకొరగా రోడ్డు వేయడంతో కంకర రాళ్లు లేచిపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల మోటారుసైకిల్‌పై వెళ్తున్న దంపతులకు కంకర రాయి తగిలి ఆసుపత్రి పాలైన ఘటన చోటుచేసుకుంది. దీనికి తోడు దుమ్ము రేగిపోవడంతో ఈరోడ్డుపరిస్థితి మరింత దారుణంగా తయారైంది. అలాగే తొర్రేడు గ్రామం మొదలు గ్రామ శివారు వరకు రోడ్డు పనులు మొదలు పెట్టలేదు. కొన్నిచోట్ల డ్రైనేజీలు తవ్వి వదిలేశారు. దీంతో ఆ ప్రాంత వాసులు మురుగు నీరు వెళ్లే మార్గంలేక అవస్థలు పడుతున్నారు.

రూ.2 కోట్లు పెండింగ్

మినీ గోకులాల బిల్లుల మంజూరు ఎప్పటికో!

- షెడ్ల నిర్మాణం పూర్తయినా మంజూరు కాని బిల్లులు
- జిల్లా వ్యాప్తంగా 197 షెడ్లకు రూ.1,92,16,716 బకాయిలు
- గోకవరంలో రూ.16 లక్షలు
- రైతుల ఎదురుచూపులు


గోకవరంలో నిర్మాణం పూర్తైయిన షెడ్

గోకవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పాడి పరిశ్రమకు పెద్ద పీట వేస్తూ పాడి రైతులకు ఉపయోగపడేలా మినీ గోకులం పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.2.30, రూ.1.85లక్షలు, రూ.1.15లక్షల నిధులతో షెడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. పశువుల సంఖ్యను బట్టి రూ.2.30లక్షల షెడ్డు నిర్మాణానికి రూ.23 వేలు, రూ.1.85 లక్షల షెడ్డుకు రూ18,500, రూ.1.15లక్షల షెడ్డుకు రూ.1.15లక్షలు లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉండగా, మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయనుంది. మినీ గోకులాల పథకం పాడి రైతులకు ఎంతో మేలు చేయనుండడంతో మరింత మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ముందుకొస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 779 గోశాలలు మంజూరయ్యాయి. వీటిలో మొదటి విడతగా 48 షెడ్లకు గాను రూ.40,89,614 మంజూరయ్యాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న మరో 197 షెడ్లకు గాను రూ.1,92,16,716 మంజూరు కావల్సి ఉంది. షెడ్ల నిర్మాణాలు పూర్తై రోజులు గడుస్తున్నప్పటికీ బిల్లులు మంజూరులో తాత్సారం జరుగు తుండడంతో రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తాము కొత్తగా నిర్మించుకున్నా బిల్లులు మంజూరుకు రోజుల తరబడి వేచి ఉండాల్సిందేనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గోకవరం మండలంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న షెడ్లకు గాను ఇంకనూ సుమారుగా రూ.16 లక్షలు బిల్లులు మంజూరు కావల్సి ఉందని సంబంధిత అధికారులు చెప్పుకొస్తున్నారు.

బిల్లులు చెల్లింపులో ఆలస్యం

మొదటి విడతలో మినీ గోకులాలు మంజూరైన లబ్ధిదారులకు షెడ్లు నిర్మించిన రెండు రోజుల వ్యవధిలోనే నగదు జమ అయ్యేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. దీంతో ఈ పథకం తమకు ఎంతో మేలు చేకూరుస్తుందని భావించి మిగిలిన రైతులు గోకులాల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ రెండో విడత మంజూరైన లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులో ఆలస్యం అవుతుండటంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖర్‌ను గెలిపించండి


రాజశేఖర్ ను గెలిపించాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, చైర్మన్ కుడుపూడి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, శెట్టిబలిజ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు అభ్యర్థించారు. రాజమహేంద్రవరం 3వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, స్థానిక నాయకులు బొమ్మనమైన శ్రీనివాస్, జక్కంపూడి అర్జున్‌లతో కలిసి వారు పట్టభద్రులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. అహ్మదున్నీషా, టేకుమూడి బద్రి, గుత్తుల బలరామశ్రీనివాస్, ట్వంటీ చిన్ని, కుడుపూడి సరోజిని, తాళం భాస్కర్, కుడుపూడి వీరబాబు, కోటా రమణ, సూరంపూడి వీరవెంకట్రావు,మేడిశెట్టి సత్యనారాయణమూర్తి, మేడిశెట్టి సతీష్ పాల్గొన్నారు.

తండేల్ చిత్ర యూనిట్ సందడి


అప్సర థియేటర్‌లో ఆదివారం రాత్రి తండేల్ చిత్ర యూనిట్ సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): తండేల్ చిత్ర కథానాయకుడు నాగచైతన్య, చిత్ర బృందం ఆదివా రం రాత్రి స్థానిక అప్సర థియేటర్‌లో సందడి చేశారు. చిత్ర కథానాయకుడు నాగచైతన్య మాట్లాడుతూ తండేల్ సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులందరికీ, ముఖ్యంగా మహిళలకు అభినందనలు తెలిపారు. తండేల్ సినిమాకు ఆంధ్ర, తెలంగాణాల్లో మంచి ఆదరణ లభిస్తుందన్నారు. సినిమాలోని శ్రీకాకుళం యాసలో డైలాగ్స్ వినిపించారు. దీంతో థియేటర్ అంతా ప్రేక్షకుల జోష్‌తో నిండిపోయింది. రాజమండ్రిలో ఎప్పుడూ మంచి సినిమాలకు అత్యధిక ఆదరణ లభిస్తుందని, అందుకే మాకు రాజమండ్రి రావడం చాలా ఆనందంగా ఉందన్నారు.

ముగిసిన చందన యాత్ర


పూజలు చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ రోడ్డులోని సింహాచలనగర్ శ్రీవరాహలక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో చందన యాత్ర మహోత్సవాల్లో భాగంగా ఆదివారం మధ్యాహ్నం అన్నసమారాధన జరిగింది. వేలాదిగా భక్తులు తరలివచ్చి శ్రీవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ ధర్మకర్తలు సూర్య సింహాచలం, నాగేశ్వరరావులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు అవసరాల కిరణ్ స్వామి, ముప్పిరాల అనంతాచార్యస్వామి, పరాశర రఘునాధభట్టర్ స్వామి పూజా కార్యక్రమాలు నిర్వహించి శ్రీవారి ప్రసాదం భక్తులకు పంపిణీ చేశారు. మహోత్సవాలు ఘనంగా జరిగినందుకు సహకరించిన రెవెన్యూ, పోలీసు, రాజమండ్రి నగర పాలక సంస్థ పారిశుద్య సిబ్బందికి ఆలయ ధర్మకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

లారీ నుంచి మంటలు

- బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం
- రూ.10 లక్షలు ఆస్తి నష్టం
- కొవ్వూరు గామన్ బ్రిడ్జిపై ఘటన
- గంటకు పైగా నిలిచిపోయిన ట్రాఫిక్


దగ్ధమవుతున్న లారీ




దగ్ధమైన లారీ

కొవ్వూరు/రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. క్వార్ట్జ్ రాయిని తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ నుంచి కాకినాడ పోర్టుకు రవాణాచేస్తున్న లారీ గామన్ బ్రిడ్జిపై కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా బ్రిడ్జి 108వ స్తంభం వద్ద అగ్ని ప్రమాదానికి గురైంది. లారీ బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయని డ్రైవర్ లోండంగి శ్రీశైలం తెలిపారు. సమాచారం తెలుసుకున్న రాజమహేంద్రవరం, కొవ్వూరు అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశారు. అప్పటికే లారీ కాలిపోవడంతో సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ఈ సంఘటనతో బ్రిడ్జిపై సుమారు గంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో డీడీఆర్ఎఫ్ సీహెచ్. మార్టిన్ లూథర్ కింగ్, రాజమహేంద్రవరం, కొవ్వూరు ఫైర్ అధికారులు పి.శ్రీనివాసరావు, ఏఎస్ఎస్ఎస్ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత



రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజేంద్రనగర్ షేక్ కాశీమ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ జరిగి మంచాన పడ్డారు. కాశీమ్ కుటుంబ పరిస్థితిని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ దృష్టికి శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే వాస్ సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.3.25లక్షలు మంజూరు చేయించారు. కాశీమ్ నివాసం వద్ద ఎమ్మెల్యే వాస్ రూ.3.25లక్షల చెక్కును ఆదివారం కాశీమ్‌కు అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వాస్‌కు, కుడుపూడి సత్తిబాబులకు కాశీమ్ కృతజ్ఞతలు తెలిపారు.




అనపర్తి మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం. పక్క చిత్రంలో బిక్కవోలు మండలం కొమరిపాలెంలో మాజీ ఎమ్మెల్యే అమ్మిరెడ్డికి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

అమ్మిరెడ్డి సేవలు చిరస్మరణీయం

అనపర్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జీబీఆర్ విద్యా సంస్థలు నెలకొల్పడంలో మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి చేసిన కృషి ఎనలేనిదని ప్రముఖులన్నారు. ఆదివారం అమ్మిరెడ్డి జయంతి సందర్భంగా స్థానిక జీబీఆర్ విద్యా సంస్థల ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో అమ్మిరెడ్డి తనయుడు మాజీ జడ్పీటీసీ పడాల రాము, జడ్పీ మాజీ ప్రతిపక్ష నాయకుడు సత్తి రామారెడ్డి, అనపర్తి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి పరిశీలకుడు చింతల రామకృష్ణ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ అబ్బాయిరెడ్డి, డీవీఆర్‌పీ పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు(ఆంధ్రజ్యోతి): కొమరిపాలెం ప్రాంత అభివృద్ధికి మాజీ ఎమ్మెల్యే, స్వర్గీయ పడాల అమ్మిరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని సర్పంచ్ వాసంశెట్టి రవికుమార్ తెలిపారు. ఆయన కుమారుడు సర్పంచ్‌ల సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పడాల రాము ఆధ్వర్యంలో అమ్మిరెడ్డి జయంతిని ఆదివారం జరిపారు. అమ్మిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ద్వారంపూడి వెంకటరెడ్డి, అధిక సంఖ్యలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ విజయోత్సవంలో భాగంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అభివృద్ధే బీజేపీ విజయానికి నాంది

ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని మోడీ చేపట్టిన సంస్కరణలు, అభివృద్ధే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో విజయానికి నాంది పలికిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ఢిల్లీలో బీజేపీ విజయంపై కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కేక్ కట్ చేసి కూటమి నేతలకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఢిల్లీలో కేజ్రీవాల్ అవినీతి వల్లే ఓటమి చెందారని అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ తుడిచిపెట్టుకుపోయిందని అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి బులిరెడ్డి, గొల్లు హేమ తులసి, గిరిడా గంగాభవాని, మల్లిడి ఆదినారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, తేతల సుధాకరరెడ్డి, ఒంటిమి సూర్యప్రకాష్, దత్తుడు శ్రీను, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

పొలమూరులో కేరళ మద్యం స్వాధీనం

వ్యక్తి అరెస్టు

అనపర్తి, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): అనపర్తి మండలం పొలమూరులో కేరళ మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు. శనివారం రాత్రి వాహన తనిఖీ చేస్తుండగా పొలమూరు గ్రామానికి చెందిన గాలింకి సిద్దయ్య పోలీసులను చూసి కంగారుపడి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో అనుమానం వచ్చిన పోలీసులు అతడిని పట్టుకుని బండి సోదా చేయగా కేరళ మద్యం బాటిళ్లు 21 బయటపడ్డాయి. వీటిని స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. పట్టుబడిన మద్యం విలువ రూ.3,200 ఉంటుందని ఎస్ఐ తెలిపారు.

నులి పురుగుల మాత్రల సరఫరా

గోకవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులి పురుగుల నివారణ దినోత్స వం సందర్భంగా గోకవరం పీహెచ్‌సీ పరిధి లోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో నులి పురుగుల నివారణ మాత్రలను సరఫరా చేసినట్లు డాక్టర్ సునీల్ తెలిపారు. గోకవరం మండ లంలోని 14,658 మందికి మాత్రలు సరఫరా చేశామన్నారు. హాస్టల్ విద్యార్థులకు చేతులు శుభ్రం చేసుకోవడంపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


కొంకుదురులో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

కొంకుదురులో సీతారామ కల్యాణం

బిక్కవోలు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కొంకుదురు బుడతల మామిడి వద్ద ఆదివారం సీతారాముల కల్యాణం జరిపారు. ఈ ప్రాంతంలో శ్రీరామకోటి స్థూపం నిర్మించి 36 ఏళ్ల అయిన సందర్భంగా గ్రామానికి చెందిన కొవ్వూరి శ్రీధర్‌రెడ్డి, పార్వతి దంపతులు కర్తలుగా వ్యవహరించి కల్యాణాన్ని జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు దీన్ని తిలకించారు.

రిజర్వేషన్ పెంపుపై హర్షం

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవులలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర మంత్రి మండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడంపై జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ బీసీలకు నామినేటెడ్ పదవులలో 34 శాతం కోటా ఇస్తామని చంద్రబాబు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దాన్ని నెరవేరుస్తూ ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ మొదటి నుంచి వెనుకబడిన తరగతులకు పెద్దపీట వేస్తోందని అన్నారు.

కోట సత్తెమ్మ ఆలయంలో ఏఎస్పీ పూజలు


ఏఎస్పీ సుబ్బరాజుకు వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

నిడదవోలు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ(ఎల్ అండ్‌వో) ఏవీ సుబ్బరాజు దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సదర్భంగా అమ్మవారికి ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం క్షీర, మహానివేదనలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అమ్మవారి దర్శనం కలుగజేశారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజ, ఇతర టికెట్ల ద్వారా రూ.1,25,920 ఆదాయం లభించినట్టు ఈవోతోపాటు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

బైక్ ఢీకొని పేపర్ ఏజెంటుకు గాయాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని పేపర్ ఏజెంటుకు తీవ్ర గాయాలయ్యాయి. కొవ్వూరుకు చెందిన హిందూ పేపర్ ఏజెంటు జక్కా నాగేంద్ర ప్రసాద్ ఆదివారం మండలంలోని వేములూరులో పేపర్ వేయడానికి సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసాద్‌తోపాటు బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు కింద పడిపోవడంతో వారికి తీవ్ర గాయాలైనట్టు సమాచారం. క్షతగాత్రులు ముగ్గురూ రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులకు ఇప్పటివరకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.


గోకవరంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

బీజేపీ విజయంపై గోకవరంలో సంబరాలు

గోకవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ విజయకేతనం ఎగరవేయడంతో గోకవరంలోని కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధి ప్రధాని మోడితోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధరావు శర్మ, కట్టా కల్యాణ్, దాసరి ధర్మరాజు, ఉంగరాల ఆదివిష్ణు, మణిరత్నం, గోవిందు, మహిళా నాయకురాలు నాగదేవి తదితరులు పాల్గొన్నారు

ఆదిత్య విద్యార్థుల స్వచ్ఛ భారత్



రాజమహేంద్రవరం కల్చరల్ ఫిబ్రవరి 9(ఆంధ్ర జ్యోతి): స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల, ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు భాస్కర్‌నగర్‌లోని గౌతమీ గోశాలలో స్వచ్ఛభారత్, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సంఘ సేవకుడు అద్దంకి రాజా విచ్చేశారు. ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎంఎస్ఎస్ శర్మ, కె.సుధాకర్ పట్నాయక్, రాజు, డైరెక్టర్ గంగిరెడ్డి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ జి.వి.ఎస్.నాగేశ్వరరావు, బీహెచ్.రమాదేవి, కె.మహేశ్వరి పాల్గొన్నారు.రాజాను వలంటీర్లు సత్కరించారు

మార్చి 8 వరకు పీజీఆర్‌ఎస్ నిలుపుదల

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా పీజీఆర్‌ఎస్‌ను నిలుపుదల చేశామని కలెక్టర్ పి.ప్రశాంతి పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు మార్చి 8వ తేదీ వరకు జిల్లా,డివిజన్, మండలస్థాయిలో పీజీఆర్‌ఎస్ నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు.ప్రజలు మీకోసం పోర్టల్ ద్వారా సచివాలయాల్లో అర్జీలు రిజిస్టరు చేసుకోవచ్చన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

ఆర్‌ఐవో నరసింహం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఈ నెల 10 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఇంటర్ ఆర్‌ఐవో ఎన్ఎస్‌వీఎల్.నరసింహం తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 77 సెంటర్లలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయన్నారు.మొదటివిడత ఈ నెల 10,11,13,14 తేదీల్లో 58 సెంటర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.ఆయా కేంద్రాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఒకేషనల్ 2వ స్పెల్ ప్రాక్టికల్ పరీక్షలు జిల్లాలో 10 సెంటర్లలో జరుగుతాయన్నారు.పరీక్షల పర్యవేక్షణకు మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

నేడు పరీక్షా పే చర్చ

డీఈవో వాసుదేవరావు

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): పరీక్షలపై విద్యార్థులకు భయాన్ని పోగొట్టేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం పరీక్షపే చర్చ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డీఈవో కే.వాసుదేవరావు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో సోమవారం ఉదయం 11 గంటలకు 6 నుంచి 10వ తరగతి వరకు చదుకునే విద్యార్థులు పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని వీక్షించే ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. జిల్లాలో సుమారు 79 వేల మంది విద్యార్థులు ,తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు రిజిస్టర్ అయ్యారన్నారు.ఈ మేరకు జిల్లా ప్రత్యేకంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమం యూట్యూబ్, టీవీ చానళ్ల ద్వారా ప్రత్యక్షప్రసారం జరుగుతుందని చెప్పారు.ప్రతి పాఠశాల తరగతి గదుల్లో ముందుగానే ఐఎఫ్‌బీలు, స్మార్ట్ టీవీలు ,కంప్యూటర్లు ఏవి వీలైతే వాటిని ఉపయోగించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ,తల్లిదండ్రులు అంతా ఈ కార్యక్రమంలో పాల్గొనేటట్లు చేయాలన్నారు.కార్యక్రమం ముగిసిన వెంటనే రెండు,మూడు ఫొటోలు,ఎస్‌సీఈఆర్‌టీ ద్వారా ఇవ్వబడిన లింక్‌లలో అప్‌లోడ్ చేయాలని హెచ్ఎంలను ఆదేశించారు.

నేడు పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖర్ నామినేషన్

- కాకినాడ నుంచి ఏలూరు టీడీపీ కార్యాలయం వరకు కార్ల ర్యాలీ
- కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు



పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్

కాకినాడసిటీ, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఈనెల 10న ఏలూరు కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంనుంచి కార్ల ర్యాలీగా బయలుదేరనున్నారు. ఉదయం 7.30 గంటలకు రామచంద్రపురం, 8.15గంటలకు మండపేట, 8.45గంటలకు రావులపాలెం, 9.10 గంటలకు తణుకు, 9.30 గంటలకు తాడేపల్లిగూడెం, 9.45గంటలకు ఉంగుటూరు, 10 గంటలకు ఏలూరు టీడీపీ కార్యాలయానికి చేరుకోనున్నారు. అక్కడినుంచి ఏలూరు కలెక్టరేట్‌కు ఉదయం 11గంటల కు చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు. భారీసంఖ్యలో కార్లతో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ నామినేషన్ ర్యాలీకి కూటమి నేతలు సన్నాహాలు చేశారు.

గీత కూ.. ఫుల్‌గా!



13 షాపులకు 387 దరఖాస్తులు

- నిడదవోలులో అత్యధికం
- అనపర్తిలో అత్యల్పం
- లైసెన్స్ ఫీజులో రాయితీ
- దుకాణాలకు డిమాండ్
- ఎన్నికల కోడ్..లాటరీ వాయిదా
- గీత కార్మికుల్లో తీవ్ర నిరాశ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మద్యం షాపులకు ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదు..ఇప్పటికే మద్యం షాపులు పాడుకున్న వారు లాభాలు రావడంలేదని లబోదిబో మంటున్నా గీత కార్మికులు వెనక్కు తగ్గలేదు. జిల్లాలో గీతకులాలకు ప్రభుత్వం కేటాయించిన 13 షాపులకు ఏకంగా 387 దరఖాస్తులు వచ్చాయి. కానీ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాటికి లాటరీ తీయడం వాయిదా పడింది.గత నెల 27వ తేదీ నుంచి ఈ నెల 8వ తేదీ శుక్రవారం సాయంత్రం ఐదు గంటల వరకూ దరఖాస్తులు స్వీకరించారు. రాజమహేంద్రవరం సబ్-కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ఈ దరఖాస్తులకు లాటరీ తీసి షాపులు కేటాయించాల్సి ఉంది.ఎన్నికల కోడ్ కారణంగా వాయిదా వేసినట్టు ఎక్సయిజ్ సూపరింటెండెంట్ లావణ్య ప్రకటించారు.దీంతో దరఖాస్తుదారుల్లో నిరుత్సాహం ఏర్పడింది.

హామీ నెరవేర్చిన కూటమి..

తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గీత కులాలకు 10 శాతం మద్యం దుకాణాలను కేటాయిస్తామని సార్వత్రిక ఎన్నికల మేని ఫెస్టోలో ప్రకటించింది.ఆ హామీ మేరకు నోటిఫికేషన్ విడుదల చేయగా జిల్లాలో 13 షాపులు వచ్చాయి.అందులో గీతకులాలకు చెందిన శెట్టిబలిజలకు 11, గౌడ-1, గౌడ్-1 వచ్చాయి. షాపుల కేటాయింపునకు రాజమహేంద్రవరం సిటీతో పాటు, పలు మండలాలను గుర్తించారు.

నిడదవోలులో 48 దరఖాస్తులు

ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇవ్వడంతో పోటీ పెరిగింది.రాజమహేంద్రవరం కార్పొరేషన్ పరిధిలో సాధారణంగా అయితే ఒక్కో దుకాణానికి ఏడాదికి 93.75 లక్షలు చెల్లించాలి. కానీ గీత కులాలకు కేటాయించిన షాపునకు 50 శాతం రాయతీ ఇవ్వడం వల్ల 46.75 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది. మండలాల్లో సాధారణంగా 76.5 లక్షలు చెల్లించాలి. గీతకులాలు మాత్రం రూ.35.75 లక్షలు చెల్లిస్తే సరిపోతుంది.దీంతో జిల్లాలో మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువగా వచ్చాయి. నిడదవోలు మండలంలోని గౌడ సామాజిక వర్గానికి కేటాయించిన దుకాణానికి ఏకంగా 48 దరఖాస్తులు వచ్చాయి. అనపర్తిలో గౌడ్ కులానికి కేటాయించిన షాపునకు మాత్రం 9 దరఖాస్తులే వచ్చాయి. సీతానగరం,వాగల్లు, గోపాలపురం మండలాల్లో శెట్టిబలిజలకు కేటాయించిన దుకాణాలకు ఒక్కో చోట 43 వంతున దరఖాస్తులు వచ్చాయి. దేవరపల్లి, పెరవలి మండలాల్లో శెట్టిబలిజలకు కేటాయించిన షాపులకు 39 వంతున దరఖాస్తులు వచ్చాయి. రాజమహేంద్రవరంలో షాపునకు 22, కడియం 22, కోరుకొండ 26, రంగంపేట 13, బిక్కవోలు 14, తాళ్లపూడి 26 దరఖాస్తులు వచ్చాయి.

ఆదాయం రూ.7.74 కోట్లు

గీతకులాలకు కేటాయించిన 13 షాపులకు 387 మంది దరఖాస్తు చేశారు. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లించారు.అంటే మొత్తం రూ.7.74 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభించింది.13 షాపులకు ప్రభుత్వానికి ఆయా లైసెన్స్‌దారులు రూ.4 కోట్ల, 75 లక్షల 75 వేలు ఏడాదికి చెల్లించాలి. గతేడాది అక్టోబరు నుంచి ఈ మద్యం కొత్త పాలసీ అమల్లోకి వచ్చింది.షాపులకు రెండేళ్ల పాటు లైసెన్స్ ఉంటుంది.కానీ ఈ షాపులకు వచ్చే నెలలో లైసెన్స్‌దార్లకు వస్తే సెప్టెంబరుకు ఒక ఏడాది పూర్తవుతుంది.అక్కడ నుంచి 2026 సెప్టెంబరు వరకూ మరో ఏడాది ఉంటుంది.

ఎన్నికల కమిషన్ చేతుల్లో..

గీత కులాలకు సోమవారం కేటాయించాల్సిన మద్యం షాపులు ఎన్నికల కోడ్ వల్ల వాయిదాపడడంతో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ అనుమతి కోరనుంది.వాస్తవానికి ఈ షాపుల కేటాయింపు ఎన్నికల కోడ్ కంటే ముందుగానే జరిగింది.దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కూడా ముందుగానే ఆరంభించారు. దీని వల్ల లాటరీ వేసి ఈ షాపులను లబ్ధిదారులకు కేటాయించేందుకు అనుమతివ్వాలని ప్రభుత్వం కోరుతున్నట్టు సమా చారం. ఎన్నికల సంఘం అనుమతి ఇస్తే వెంటనే లాటరీ వేసి ఈ షాపులను అప్పగించే అవకాశం ఉంది. లేదంటే మార్చి నెల 8వ తేదీ తర్వాతే షాపులు కేటాయిస్తారు.

ఫొటో తీయమని చెప్పి.. గోదారిలో దూకేశాడు!

అప్పుల బాధ తాళలేక ఒకరి ఆత్మహత్య

- రూ. కోటి వరకూ అప్పులు ఉన్నట్టు సమాచారం
- 10న సొమ్ములు చెల్లిస్తానని చెప్పిన వైనం
- ఆదివారం సినిమా చూసి వస్తూ ఆత్మహత్య





కొవ్వూరు/దేవరపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : తన షాపులో పనిచేసే యువకుడితో కలిసి సినిమాకు వెళ్లాడు.. తిరిగి వస్తూ గోదావరిపై రోడ్ కం రైలు బ్రిడ్జిపై ద్విచక్రవాహనం ఆపాడు. కిందకు దిగి సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీయమన్నాడు.. ఫొటో తీస్తుండగానే గోదావరిలో దూకేశాడు.క్షణాల్లో మృత్యువాత పడ్డాడు.చూస్తుండగానే యజమాని మృతిచెందడంతో అతని వద్ద పనిచేసే చిట్యాలకు చెందిన యువకుడు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యాడు. దేవరపల్లి గ్రామానికి చెందిన పింజర్ల నాగేశ్వరరావు (64) చెప్పుల వ్యాపారంతో పాటు ప్రైవేటు చీటీల వ్యాపారం చేస్తుంటాడు. గత 36 ఏళ్లగా దేవరపల్లి ప్రజలకు సుపరిచితుడు. దేవరపల్లి,బంధపురం, లక్ష్మీపురం, యాదవోలు, దుద్దుకూరు గ్రామాల్లో చీటీలు కట్టించుకునేవాడు.గత రెండేళ్లుగా చీటీలు పాడుకున్నవారికి డబ్బులు చెల్లించకపోవడంతో ఒత్తిడి పెరిగింది. దీంతో గతేడాది గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో కాపాడారు. నాటి నుంచి చెప్పుల వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఇతను చీటీల డబ్బులు సుమారు రూ.కోటికి పైగా చెల్లించాల్సి ఉన్నట్టు తెలిసింది.ఇటీవల చీటి డబ్బుల కోసం ఒత్తిడి పెరిగింది. ఈ నేపథ్యంలో కొంతమందికి ఐపీ నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది.అయినా షాపు వద్దకు వచ్చి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తుండడంతో బాగా ఇబ్బందిపడుతున్నాడు. చాలా మందికి ఈ నెల 10వ తేదీన డబ్బులు చెల్లిస్తానని చెప్పినట్టు స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా వెదవ జీవితం బతకాలని లేదని స్నేహితుల వద్ద వాపోతున్నాడు. స్నేహితులు వారిస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగా ఆదివారం సెలవు కావడంతో తన వద్ద పనిచేసే యువ కుడిని తీసుకుని రాజమహేంద్రవరం వెళ్లాడు.తిరిగి వచ్చే సమయంలో కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జిపై 106వ స్తంభం వద్ద ఆగారు. ఫొటోలు తీయమని చెప్పి ఇంతలో గోదావరిలో దూకేశాడు. ఈ సంఘటనను నదిలో నుంచి గమనిస్తున్న జాలర్లు పడవపై వచ్చి కొన ఊపిరితో ఉన్న నాగేశ్వరరావును రాజమహేంద్రవరం వైపు తీసుకువెళ్లారు. లోతు ఎక్కువగా ఉన్న చోట దూకడంతో అప్పటికే మృతిచెందాడు. భార్య రెండేళ్ల కిందట మృతిచెందింది. అతనికి ఇద్దరి కుమార్తెలు ఉండగా వివాహాలయ్యాయి. చిన్న కుమార్తె పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

తండేల్ సినిమా చూసి వస్తుండగా ఇలా చేశారు!

ఉదయం ఫోన్ చేసి రాజమహేంద్రవరం వెళదాం రమ్మంటే వచ్చాను.. తండేల్ సినిమాకు తీసుకెళ్లారు. అనంతరం శ్రీ కన్య రెస్టారెంట్‌కు వెళ్లి భోజనం చేశాం.ఉదయం నుంచి బాగానే ఉన్నారు. ఇలా చేస్తారని అనుకోలేదు. ఫొటో తీయమని చెప్పి గోదావరిలో దూకేశారు.నేను చూస్తుండగానే చనిపోయారు. తలుచుకుంటే బాధగా ఉంది. ఆ ఘటన నా కళ్లెదుట మెదులుతూనే ఉంది.

- విక్రమ్, షాపులో పనిచేసే యువకుడు, చిట్యాల



రాజమహేంద్రవరంలో కాతేరు వద్ద గామన్ బ్రిడ్జిపై తగలబడుతున్న లారీ

వెళుతున్న లారీ నుంచి మంటలు

గామన్ బ్రిడ్జిపై ఆదివారం ఉదయం ఒక లారీ వెళుతోంది.. ఒక పక్క నుంచి మంటలు వస్తూనే ఉన్నాయి.. లారీ డ్రైవర్ గమనించలేదు.. ఆ మంటలు పెరిగాయి.. వెనుక వస్తున్న డ్రైవర్ అప్రమత్తం చేయడంతో డ్రైవర్ కంగారుపడి కిందకు దిగిపోయాడు. పగులు రాయి లోడుతో వెళుతున్న లారీ చూస్తుండగానే దగ్ధమైపోయింది.. అరగంటలో లారీ మొత్తం కాలి బూడిదైపోయింది.. ప్రమాదాన్ని గమనించిన లారీ డ్రైవర్, క్లీనర్ బయటపడి ప్రాణాలు కాపాడుకున్నారు.. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. - 8లో

భూముల క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకోండి

కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అభ్యంతరం లేని అక్రమిత ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి తీసుకున్న నిర్ణయంతో అర్హులైన పేదలకు లబ్ధి చేకూరుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఈజీగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం దక్కిందన్నారు. ఈ పథకానికి సంబంధించి మీ సేవ కేంద్రాలు, గ్రామ,వార్డు సచివాయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సీసీఎల్ఎఫ్ కమిషనర్ జి.జయలక్ష్మి తెలియజేశారన్నారు. అందుకు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో సిబ్బందికి సూచనల చేసినట్టు తెలిపారు. జీవో నెం 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం 2025 పేరిట భూములు క్రమబద్ధీకరణ చేపడతామన్నారు.ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు గ్రామ,వార్డు సచివాయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. క్రమబద్ధీకరణ మేరకు లబ్ధిదారులకు పట్టా, కన్వేయన్స్ డీడ్ అందజేసిన రెండేళ్ల తర్వాత యాజమాన్య హక్కులు జారీ చేస్తామన్నారు. లబ్ధిదారులు తమ పూర్తి వివరాలు.. నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాలతో మీసేవ ద్వారా అప్‌లోడ్ చేయవలసి ఉంటుందన్నారు. 2019 అక్టోబరు 15ను ప్రామాణిక తేదీగా తీసుకుని ఆ తేదీ కంటే ముందు ఆక్రమణల్లో ఉన్న భూములను క్రమబద్ధీకరించడం జరుగుతుందన్నారు.



కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

కోట సత్తెమ్మ ఆలయంలో ఏఎస్పీ పూజలు



ఏఎస్పీ సుబ్బరాజుకు వేదాశీర్వచనం అందిస్తున్న పండితులు

నిడదవోలు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోట సత్తెమ్మ ఆలయాన్ని జిల్లా అడిషనల్ ఎస్పీ(ఎల్ అండ్‌వో) ఏవీ సుబ్బరాజు దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సదర్భంగా అమ్మవారికి ధూపహారతి, నిత్యార్చనా, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. అనంతరం క్షీర, మహానివేదనలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కళకళలాడింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అమ్మవారి దర్శనం కలుగజేశారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాద విక్రయాలు, పూజ, ఇతర టికెట్ల ద్వారా రూ.1,25,920 ఆదాయం లభించినట్టు ఈవోతోపాటు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

ఉమా చోడేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన



కొవ్వూరులో చోడేశ్వరస్వామికి అభిషేకాలు చేస్తున్న పండితులు

కొవ్వూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరులోని పాతవూరులో శ్రీ ఉమా చోడేశ్వర స్వామికి లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఆదివారం రాజమహేంద్రవరానికి చెందిన చిరవూరి సుబ్రహ్మణ్యం, రమా సత్యశైలజ దంపతులు పీటలపై కూర్చుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి గణపతిపూజ, ఏకాదశ రుద్రాభిషేకాలు, రుద్రహోమం, అమ్మ వారికి కుంకుమ పూజలు, స్వామికి లక్ష బిల్వార్చన చేశారు. నీరాజనమంత్ర పుష్పాలు సమర్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వీఎస్ సోమయాజులు, వైవీవీ సత్యనారాయణ మూర్తి, కలిగొట్ల కృష్ణారావు, ఇనుగంటి ఉమారామారావు, తెన్నేటి సూర్యనారాయణ తదితర భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తాళ్లపూడిలో ఇస్కాన్ ఐదో వార్షికోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న సత్యగోపీనాథ్ ప్రభూజీ

తాళ్లపూడి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దైవం కోసం భూమిపై భక్తులు పరితపిస్తున్న విషయం తెలుసుకునేందుకు శ్రీమహావిష్ణువు భూమి మీదకు భక్తావతారిగా రావాలన్న అవతారమే శ్రీకృష్ణ చైతన్య రూపమని రాజమహేంద్రవరం ఇస్కాన్ ప్రతినిధి సత్యగోపీనాథ్ ప్రభూజీ అన్నారు. ఆదివారం స్థానిక మదన గోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఇస్కాన్ ఐదో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హరేకృష్ణ హరేరామ మంత్రాన్ని జపిస్తూ జీవన యాత్ర సాగించాలన్నారు. అనంతరం కృష్ణ భక్తులతో నగర సంకీర్తన నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ భక్తులు శ్యామ్‌నాథ్ ప్రభూజీ, శివానంద ప్రభూజీ, స్థానిక సభ్యులు సింహాద్రి జనార్దనరావు, గర్రే సురేష్, చెరుకూరి బంగారుబాబు, గోకవరపు జితేంద్ర రవి, కె.రామస్వామి పాల్గొన్నారు.

వరిపై డ్రోన్‌తో జీవామృతం పిచికారీ



ఉంగ్రాజవరంలో కషాయాల పిచికారీకి డ్రోన్‌ను సిద్ధం చేసిన దృశ్యం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఉండ్రాజవరం, తాడిపర్రు గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డ్రోన్ సహాయంతో నూతన సాంకేతిక విధానంలో కషాయాల పిచికారీ కార్యక్రమం నిర్వహించారు. రెండు గ్రామాల్లో ఉన్న 35 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వేపగింజల కషాయం, పాల ఇంగువ, మీనామృతం ద్రావణాలను కలిపి వరి పంటపై డ్రోన్ ద్వారా పిచికారీ చేశారు. ఇంతవరకు మండలంలో 200 ఎకరాల్లో డ్రోన్ ద్వారా కషాయాలను పిచికారీ చేసినట్టు ప్రకృతి వ్యవసాయ శాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ ప్రాజెక్టు ఎడ్యుకేట్ మేనేజర్ రామకృష్ణ, డిస్ట్రిక్ మెడల్ మేకర్ పురుషోత్తం, యూనిట్ ఇన్‌చార్జిలు గారపాటి సత్యనారాయణ, అక్కిన కాశీ విశ్వనాథం, ఐసీఆర్‌పీ పెదపాటి ఉమామహేశ్వరి, ఎం.ఇందిర, కడలి మోనిక, రైతులు పాల్గొన్నారు.

అగ్రిస్టాక్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

» రైతులు ప్రభుత్వ పథకాలు పొందేందుకు ఈ ప్రక్రియ తప్పనిసరి

» వ్యవసాయాధికారి విశ్వాసరావు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రైతులు అగ్రిస్టాక్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎం.విశ్వాసరావు శనివారం తెలిపారు. అనంతరం ఎన్‌రోల్‌మెంట్ ఐడీని పొందాలని రైతులకు సూచించారు. రైతులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి ప్రభుత్వ పథకాలున, ఇతర ప్రభుత్వ సేవలు పొందేందుకు ఈ రిజిస్ట్రేషన్ పక్రియ తప్పనిసరి అని చెప్పారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడంలో భాగంగా ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్టు తెలిపారు. రైతులు ఈ అగ్రిస్టాక్ రిజిస్ట్రేషన్ రైతు సేవా కేంద్రాల్లోను, విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్స్ లేదా విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్స్ వద్ద చేయించుకోవచ్చని వివరించారు. రిజిస్ట్రేషన్ కోసం పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు ఎక్కౌంట్ పాస్‌బుక్, ఆధార్‌కార్డుకు లింక్ అయిన ఫోన్ నెంబరు తీసుకువెళ్లాలని ఏవో విశ్వాసరావు చెప్పారు.

ఉండ్రాజవరంలో ఉచిత వైద్య శిబిరం



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సుంకవల్లి పాఠశాలలో తణుకు పట్టణానికి చెందిన సితార ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జనరల్ ఎమ్‌డీ డాక్టర్ సుంకవల్లి నీలుమహేంద్ర ఆధ్వర్యంలో 150 మంది రోగులకు కంటి, ఆర్థోపెడిక్, జనరల్ పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. నేత్రవైద్య నిపుణులు హస్సేన్, ఆర్థోపెడిక్ నిపుణులు నిమ్మగడ్డ అచ్యుత రామయ్య రోగులకు వైద్య సేవలందించారు.

జీవిత బీమా ప్రాముఖ్యతను తెలియజేయాలి



రూ.25 లక్షల ప్రీమియం సేకరించిన ఏజెంటును సత్కరిస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జీవిత బీమా ప్రాముఖ్యతను అందరికీ తెలియజేయాలని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సంధ్యారాణి అన్నారు. ఆదివారం కొవ్వూరులోని నాళం వారి వీధికి చెందిన ఏజెంటు జున్నూరి దేవి జనవరి నెలలో రూ.25 లక్షలు బీమా సేకరించడంపై ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులు మధ్య ఆమెను సన్మానించారు. అనంతరం స్థానికులకు జీవిత బీమా ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎల్ఐసీ మార్కెటింగ్ మేనేజర్ సత్యనారాయణ సాహు, బి.శ్రీనివాస్, బ్రాంచ్ మేనేజర్ ఎస్ఎస్ శ్రీరామ్, యు.విష్ణువర్ధన్ పాల్గొన్నారు.

20 వరకు రైళ్లు ఆలస్యం

సామర్లకోట, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం రైల్వేస్టేషన్ వద్ద జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనుల వల్ల ఈ నెల 10వ తేదీ నుంచి 20 వరకు సామర్లకోట మీదుగా సికింద్రాబాద్‌కు వెళ్లే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు 75 నిమిషాల నుంచి 90 నిమిషాల పాటు ఆలస్యంగా నడుస్తాయని రైల్వే పీఆర్‌వో కార్యాలయం నుంచి శనివారం రాత్రి ఆదేశాలు అందాయి. ఈమేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారికి అందిన సమాచారాన్ని 'ఆంధ్రజ్యోతి' సేకరించింది. 20834 నెంబరు గల వందే భారత్ (సికింద్రాబాద్ - విశాఖ) మధ్య నడిచే ఎక్స్‌ప్రెస్ 19,20 తేదీలలో 75 నిమిషాలు ఆలస్యంగా బయలుదేరుతుంది.

రూ.2 కోట్లు పెండింగ్

మినీ గోకులాల బిల్లుల మంజూరు ఎప్పటికో!

» షెడ్‌ల నిర్మాణం పూర్తయినా మంజూరు కాని బిల్లులు

» జిల్లా వ్యాప్తంగా 197 షెడ్లుకు రూ.1,92,16,716 బకాయిలు

» గోకవరంలో రూ.16 లక్షలు

» రైతుల ఎదురుచూపులు



గోకవరంలో నిర్మాణం పూర్తైయిన షెడ్

గోకవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక పాడి పరిశ్రమకు పెద్ద పీట వేస్తూ పాడి రైతులకు ఉపయోగపడేలా మినీ గోకులం పథకాన్ని ప్రవేశ పెట్టింది. ఈ పథకంలో భాగంగా ప్రభుత్వం రూ.2.30, రూ.1.85లక్షలు, రూ.1.15లక్షల నిధులతో షెడ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. పశువుల సంఖ్యను బట్టి రూ.2.30లక్షల షెడ్డు నిర్మాణానికి రూ.23 వేలు, రూ.1.85 లక్షల షెడ్డుకు రూ18,500, రూ.1.15లక్షల షెడ్డుకు రూ.1.15లక్షలు లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉండగా, మిగిలిన మొత్తాన్ని లబ్ధిదారుడి ఖాతాలో జమ చేయనుంది. మినీ గోకులాల పథకం పాడి రైతులకు ఎంతో మేలు చేయనుండడంతో మరింత మంది రైతులు ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు ముందుకొస్తున్నారు. జిల్లాలో ఇప్పటివరకు 779 గోశాలలు మంజూరయ్యాయి. వీటిలో మొదటి విడతగా 48 షెడ్లుకు గాను రూ.40,89,614 మంజూరయ్యాయి. ఇప్పటికే నిర్మాణం పూర్తి చేసుకున్న మరో 197 షెడ్లుకు గాను రూ.1,92,16,716 మంజూరు కావల్సి ఉంది. షెడ్ల నిర్మాణాలు పూర్తై రోజులు గడుస్తున్నప్పటికీ బిల్లులు మంజూరులో తాత్సారం జరుగు తుండడంతో రైతులు నిస్సహాయ స్థితిలో ఉన్నారు. తాము కొత్తగా నిర్మించుకున్నా బిల్లులు మంజూరుకు రోజుల తరబడి వేచి ఉండాల్సిందేనని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గోకవరం మండలంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న షెడ్లుకు గాను ఇంకనూ సుమారుగా రూ.16 లక్షలు బిల్లులు మంజూరు కావల్సి ఉందని సంబంధిత అధికారులు చెప్పుకొస్తున్నారు.

బిల్లులు చెల్లింపులో ఆలస్యం

మొదటి విడతలో మినీ గోకులాలు మంజూరైన లబ్ధిదారులకు షెడ్ల నిర్మించిన రెండు రోజుల వ్యవధిలోనే నగదు జమ అయ్యేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. దీంతో ఈ పథకం తమకు ఎంతో మేలు చేకూరుస్తుందని భావించి మిగిలిన రైతులు గోకులాల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ రెండో విడత మంజూరైన లబ్ధిదారులకు బిల్లులు చెల్లింపులో ఆలస్యం అవుతుండటంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భీమోలులో సీపీఐ ప్రచారం

గోపాలపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని భీమోలు గ్రామానికి ఈ నెల 12న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ వస్తున్న సందర్భంగా సీపీఐ నాయకులు, కార్యకర్తలు కరపత్రాలతో ఆదివారం ఇంటింటా ప్రచారం చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే ఉద్దేశంతో జనసమీకరణ కోసం గ్రామంలో ఇంటింటా కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్నట్టు పార్టీ నాయకులు తెలిపారు.

కొవ్వూరులో సూర్య ద్వాదశ కామ్య వ్రతం

కొవ్వూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరులోని శ్రీనివాస స్నానఘట్టంలో ప్రకృతి రావణబ్రహ్మ శివాలయంలో నిర్వహిస్తున్న మహా సౌరయాగం 11వ రోజుకు చేరుకుంది. ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ అనపర్తి శివరామకృష్ణ పర్యవేక్షణలో సూర్య ఉపాసకుడు విక్రమాదిత్య ఆధ్వర్యంలో సూర్య ద్వాదశ కామ్య వ్రతం నిర్వహించారు. ఈ వ్రతం మొట్టమొదటి సారిగా కొవ్వూరులో జరగడం ఎంతో విశేషమన్నారు. అలాగే సూర్య నమస్కారాలు సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

విద్యార్థులు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలి

దేవరపల్లి, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మార్కుల కోసమే కాకుండా విషయ పరిజ్ఞానం పెంపొందించుకునే విధంగా విద్యనభ్యసించాలని సుమంత్ మల్టీస్పెషాలిటీ గుండె వైద్య నిపుణుడు కడియం సుమంత్ అన్నారు. దేవరపల్లిలోని భాష్యం స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం ఆదివారం జరిగింది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసి డాక్టర్ సుమంత్ మాట్లాడుతూ విద్యార్థులు ఫస్ట్‌ర్యాంకులు రాకున్న తాము ఎంచుకున్న రంగంలో ఉన్నతస్థాయిలో ఎదగాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ సుమంత్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరయ్యానాయుడు, ఛామ్స్ ప్రిన్సిపాల్ సబాన, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడిపందాల శిబిరంపై దాడి

వాడపల్లిలో నలుగురి అరెస్టు

కొవ్వూరు, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కోడి పందాల శిబిరంపై పోలీసులు దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.జగన్మోహనరావు తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లిలో ఆదివారం కోడి పందాలు నిర్వహిస్తున్నారని సమాచారం రావడంతో పట్టణ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.16,800 నగదు, 2 కోళ్లు, 2 కత్తులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని పేపర్ ఏజెంటుకు తీవ్ర గాయాలు

కొవ్వూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): బైక్ ఢీకొని పేపర్ ఏజెంటుకు తీవ్ర గాయాలయ్యాయి. కొవ్వూరుకు చెందిన హిందూ పేపర్ ఏజెంటు జక్కా నాగేంద్ర ప్రసాద్ ఆదివారం మండలంలోని వేములూరులో పేపర్ వేయడానికి సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో ప్రసాద్‌తోపాటు బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు కింద పడిపోవడంతో వారికి తీవ్ర గాయాలైనట్టు సమాచారం. క్షతగాత్రులు ముగ్గురూ రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతున్నారు. దీనిపై పోలీసులకు ఇప్పటివరకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

ప్రజా సంక్షేమంపై దృష్టి పెట్టాలి

దేవరపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దుర్గారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దుర్గారావు

దేవరపల్లి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టిపెట్టాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. మండలంలో ప్రధాన సమస్యలపై అధికారులు దృష్టి సారించాలని, వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా వచ్చే మండల పరిషత్ సమావేశానికి అధికారులంతా హాజరుకావాలని, అభివృద్ధి పనులపై దృష్టి సారించాల న్నారు. దేవరపల్లి విద్యుత్‌శాఖ ఏఈ సీహెచ్.వెంకట్రావు మాట్లాడుతూ వేసవిలో తాగునీరు అందించడానికి 3ఫేస్ విద్యుత్ అందజేస్తామని, కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తామన్నారు. హెచ్‌టీ లైన్ల కింద ఇళ్ల నిర్మాణానికి అధికారులు అనుమతి ఇవ్వొద్దని ఆయన చెప్పారు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఉన్న బోర్ల ద్వారా కొంత మంది రైతులు నీటిని పొలాలకు తరలిస్తున్నారని, అది చట్టవిరుద్ధమని అన్నారు. డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయ భూములు డిజిటల్ సర్వే చేస్తున్నామన్నారు. అలాగే ఇతర శాఖల అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ డీఎస్ఆర్.కుమారి, పంచాయతీరాజ్ ఏఈ వినోద్ కుమార్, వైస్ ఎంపీపీ సాదే సుబ్బారావు, మండల పరిషత్ సూపరింటెండెంట్ జి.శాంతి, ఎంపీటీసీలు కామిశెట్టి శిరోమణి, కాళ్ల వెంకటరత్నం, పల్లికొండ రామలక్ష్మి, సుంకవల్లి నాగదుర్గ తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి మంటలు

» బ్యాటరీ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం

» రూ.10 లక్షలు ఆస్తి నష్టం

» కొవ్వూరు గామన్ బ్రిడ్జిపై ఘటన

» గంటకు పైగా నిలిచిపోయిన ట్రాఫిక్



దగ్ధమవుతున్న లారీ





దగ్ధమైన లారీ

కొవ్వూరు/రాజమహేంద్రవరం రూరల్ ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. క్వార్ట్ రాయిని తెలంగాణ రాష్ట్రం మిర్యాలగూడ నుంచి కాకినాడ పోర్టుకు రవాణాచేస్తున్న లారీ గామన్ బ్రిడ్జిపై కొవ్వూరు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తుండగా బ్రిడ్జి 108వ స్తంభం వద్ద అగ్ని ప్రమాదానికి గురైంది. లారీ బ్యాటరీ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయని డ్రైవర్ లోండంగి శ్రీశైలం తెలిపారు. సమాచారం తెలుసుకున్న రాజమహేంద్రవరం, కొవ్వూరు అగ్నిమాపక శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపు చేశారు. అప్పటికే లారీ కాలిపోవడంతో సుమారు రూ.10 లక్షలు ఆస్తి నష్టం సంభవించిందన్నారు. ఈ సంఘటనతో బ్రిడ్జిపై సుమారు గంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో డీఈఆర్ఎఫ్ సీహెచ్. మార్టిన్ లూథర్ కింగ్, రాజమహేంద్రవరం, కొవ్వూరు ఫైర్ అధికారులు పి.శ్రీనివాసరావు, ఏవీఎస్ఎన్ఎస్ వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే ముప్పిడి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో పలు ఉపాధ్యాయ సంఘ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 7 నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్య ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు కె.బాలాజీ, గొర్రెల శ్రీధర్, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు పాల్గొన్నారు.

మోదీ సంస్కరణలు.. ఢిల్లీలో విజయానికి నాంది

» ఎమ్మెల్యే నల్లమిల్లి » అనపర్తిలో కూటమి నాయకుల సంబరాలు



అనపర్తిలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రధాని మోదీ చేపట్టిన సంస్కరణలు, అభివృద్ధే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో విజయానికి నాంది పలికిందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం అనపర్తిలోని ఎన్డీయే కార్యాలయంలో ఢిల్లీలో బీజేపీ విజయం సాధించడంతో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి కేక్ కట్ చేసి కూటమి నాయకు లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఢిల్లీలో కేజ్రీవాల్ చేసి న అవినీతి వల్లే ఓటమి చెం దారన్నారు. దేశాభివృద్ధికి ప్ర ధాని మోదీ చేస్తున్న కార్యక్రమాలతో ఢిల్లీ సహా 21 రాష్ట్రాల్లో బీజేపీ అధికారం చేపట్టిందన్నారు. కార్యక్రమం లో తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి బులిరెడ్డి, గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని, మల్లిడి ఆదినారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, తేతల సుధాకరరెడ్డి, సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

గోకవరం: గోకవరంలోని బీజేపీ నియోజకవర్గ కార్యాలయం వద్ద విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బాణసంచా కాల్పులు, కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో బీజేపీ జెండా ఎగరవేయడం ఖాయమన్నారు. దేశాభివృద్ధి మోదీతోనే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారని, రాబోయే కాలంలో బీజేపీ ప్రభంజనం దేశవ్యాప్తంగా విస్తరిస్తుందన్నారు. కార్యక్రమంలో మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్న దొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధరావు శర్మ, కట్టా కళ్యాణ్, దాసరి ధర్మరాజు పాల్గొన్నారు.



గోకవరంలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ శ్రేణులు

శ్మశాన వాటిక షెడ్డు నిర్మాణం నిలుపుదల



సింగరాజపాలెంలో షెడ్డు నిర్మాణం నిలిపివేస్తున్న దృశ్యం

గోపాలపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): హిందువులు దహన సంస్కారాలు నిర్వహించే శ్మశాన వాటిక వద్ద నిర్మిస్తున్న షెడ్డును ఎంపీడీవో సింహాద్రిరావు ఆదివారం నిలుపుదల చేశారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగరాజపాలెం గ్రామశివారులో ఉన్న ఊరచెరువును అనుకుని ఉన్న స్థలంలో కొన్నేళ్లుగా గ్రామస్థులు దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. అయితే వర్షకాలంలో ఈ శ్మశానవాటిక ప్రాంతమంతా నీటితో మునిగిపోతుంది. ఆ సమయంలో ఎవరైనా మృతి చెందితే గ్రామస్థులు పోలవరం కుడి ప్రధాన కాల్వ గట్టు మీదో లేక కొవ్వూరు గోష్పాద క్షేత్రం వద్దకో మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహిస్తారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఒక దాత.. సర్పంచ్, గ్రామస్థుల అనుమతితో నాలుగు రోజుల క్రితం శ్మశాన వాటికలో షెడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే అదే గ్రామానికి చెందిన వేరొకరు ప్రభుత్వ స్థలంలో షెడ్డు నిర్మాణం జరుగుతోందని ఎంపీడీవోకు ఫిర్యాదు చేయడంతో ఆయన అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నల్లజర్ల పోలీసులను వెంటబెట్టుకుని శ్మశాన వాటికకు చేరుకున్నారు. అనంతరం షెడ్డు నిర్మాణం నిలుపుదల చేశారు.

పెళ్లయిన ఏడాదికే..యువకుడి ఆత్మహత్య

అనపర్తి ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) :పెళ్లైన ఏడాదికే ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అనపర్తికి చెందిన తమలంపూడి సాయి సాకేతిరెడ్డి (29) కొంతకాలంగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. దీంతో ఆదివారం పురుగుల మందు తాగాడు. దాన్ని గుర్తించిన బంధువులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. దీనిపై మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు అనపర్తి ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపారు.

ప్రమాదవశాత్తూ యువకుడి మృతి

సీతానగరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన సీతానగరం మండలం బొబ్బిల్లంక వద్ద ఆదివారం జరిగింది. మండలంలోని చినకొండేపూడికి చెందిన దంతే ప్రసాద్ (26) రాజమహేంద్రవరం రూరల్ మండలంలో ఓ శుభకార్యానికి హాజరై తిరిగి వస్తుండగా... బొబ్బిల్లంక వద్ద ఇసుక కుప్పలు అడ్డు వచ్చాయి. దీంతో బండి స్కిడ్ అవడంతో అటుగా వస్తున్న లారీ వెనుక చక్రాల కింద పడిపోయాడు. మృతుని తలపై నుంచి లారీ వెళ్లడంతో సంఘటనా స్థలంలోనే ప్రసాద్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం తరలించారు. కేసు నమోదు చేశారు.